క్లుప్తంగా

పేదలందరికీ సొంతిల్లు ఉండాలన్నదే సీఎం ఆశయం



శలపాకలో ఇళ్ల స్థలాల పంపిణీపై సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దార్

కాజులూరు: రాష్ట్రంలోని ప్రతి నిరుపేద సొంత ఇల్లు కలిగి ఉండాలన్నదే సీఎం జగన్ ఆశయమని మండల తహసీల్దార్ బి.సాయిసత్యనారాయణ అన్నారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా గొల్లపాలెం, శలపాక, తణుకువాడ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మండలంలోని శలపాకలో అధికారులు ఇళ్ల స్థలాలను కేటాయించారు. రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా ఈ నెల 11వ తేదీ ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు ఇళ్ల పట్టాలు లబ్ధిదారులకు అందజేయనున్నారు. ఈ మేరకు శుక్రవారం మండల తహసీల్దార్ సాయి సత్యనారాయణ తదితరులు లే అవుట్‌ను సందర్శించి పంపిణీ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ పోతుల గనిరాజు, ఆర్ఐ వేగేశ్వరరావు, వీఆర్వోలు గనికమ్మ, ఈశ్వరరావు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జనసేనకు చంద్రబోస్ రాజీనామా

మండపేట: జనసేన పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, పార్టీ పదవులకు రాజీనామా చేస్తున్నట్టు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోనాల చంద్రబోస్ తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచి నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు కృషి చేశానన్నారు. స్థానిక నాయకత్వంపై విసుగు చెంది పార్టీని వీడుతున్నట్టు శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పాఠశాలలకు జగనన్న విద్యాకానుక కిట్లు



జగనన్న విద్యాకానుక కిట్లను తరలింపును పరిశీలిస్తున్న షాలెంరాజు, రామచంద్రరావు

మండపేట: జగనన్న విద్యాకానుక కిట్లను అధికారులు పాఠశాలలకు తరలిస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన మొదటి రోజునే కిట్లు పంపిణీకి విద్యాశాఖ చర్యలు చేపట్టింది. మండపేట అర్బన్, మండలానికి సంబంధించి వచ్చిన కిట్లను స్థానిక గౌతమి మున్సిపల్ హైస్కూల్‌లోని స్టాక్ పాయింట్‌లో ఉంచారు. వేసవి సెలవుల అనంతరం సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో శుక్రవారం స్టాక్ పాయింట్ నుంచి పట్టణం, మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు కిట్లు తరలింపు ప్రక్రియ చేపట్టారు. డీవైఈఓ షాలెంరాజు, ఎంఈఓ ఎస్.రామచంద్రరావులు దగ్గరుండి కిట్లు తరలింపును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండపేట అర్బన్, రూరల్‌లో పరిధిలో ఎయిడెడ్ స్కూల్‌తో కలిపి 69 పాఠశాలల్లోని 7,005 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ప్రభుత్వ భవన నిర్మాణాలు వేగవంతం చేయాలి

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, మండల ఇంజినీరింగ్ జేఈ కె.మురళీకృష్ణ అన్నారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్‌డీ పీఆర్‌సీ రాజ్‌కుమార్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో గ్రామ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో ఉద్యోగులందరూ సమన్వయంతో పనిచేసి ప్రజలకు ప్రజా సంక్షేమ పథకాలను అందించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజారోగ్య రక్షణ కోసం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ లక్ష్యాలను అధిగమించాలన్నారు. అనంతరం గ్రామాల వారీగా చేపట్టిన అభివృద్ధి పనులను సమీక్షించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు కె.సంజీవ్‌రెడ్డి, ఆర్‌వీవీ సత్యనారాయణ, శ్యామ్‌సుందర్, కె.మోక్షాంజలి, ఎస్.వీర్రాజు, యు.రేణుక, సుప్రియ, వెంకటరెడ్డి, అయ్యన్న, సీహెచ్ వీరమాత, వేణు, డి.సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజల్లోకి మినీ మేనిఫెస్టో

మండపేట: మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు చిన్నం బాబురమేష్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గాంధీనగర్‌లోని షాదీఖానా వద్ద ఎమ్మెల్యే వేగుళ్ల సెల్ఫీ ఛాలెంజ్ చేశారు.

వలంటీర్ అదృశ్యంపై కేసు

అయినవిల్లి: వలంటీర్ బండారు శ్రీనివాసరావు కనిపించడం లేదని ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై ఎస్.నాగేశ్వరరావు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలోని మడుపల్లిలో బండారు శ్రీనివాసరావు వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం నుంచి శ్రీనివాసరావు కనిపించడం లేదని శ్రీనివాసరావు బావ మేడిశెట్టి గోవిందరావు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సచివాలయాలు.. సేవానిలయాలు

- పేదల ఇంటి ముంగిటకు ప్రభుత్వ సేవలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- వలంటీర్ సేవకులకు పురస్కారాలు
- కపిలేశ్వరపురం మండలంలో 20 సచివాలయాలు, 15 ఆర్బీకేలు



వల్లూరు సచివాలయంలో గంటలో మంజూరైన రేషన్ కార్డును అందజేస్తున్న ఉద్యోగులు (ఫైల్)



కాకినాడ ఆసుపత్రికెళ్లి పింఛను ఇస్తున్న వలంటీర్

కపిలేశ్వరపురం: మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజం చేశారు. ప్రభుత్వ సేవలన్నీ పేదల ఇంటి ముంగిటకు చేర్చారు. గ్రామాల్లో ప్రజల అవసరాలు తీరేలా అధికారులు అందుబాటులో ఉండేలా గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలకు శ్రీకారం చుట్టారు. ప్రతి రెండు వేల జనాభాకు ఒక సచివాలయం ఉండేలా ఏర్పాటు చేశారు. ఆ సచివాలయాల్లో 10 నుంచి 12 మంది అధికారులు ఉంటారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా వారే పరిష్కరిస్తారు. దీంతో సచివాలయాల సేవలు అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయి. ప్రభుత్వం ప్రతినిత్యం ప్రజల పక్షాన నిలుస్తోంది. ప్రజల ఆకాంక్షలు, అవసరాలపై నిరంతరం అధ్యయనం చేస్తూ వాటిని తీర్చేందుకు కృషి చేస్తోంది. గతంలో ఇవేమీ దక్కకపోవడంతో గత ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. ఈ అవస్థలన్నీ సచివాలయ వ్యవస్థ ద్వారా తీరుస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

సచివాలయ వ్యవస్థ నేపథ్యమిదీ

2019కు ముందు రాష్ట్ర పాలనలో ధనం, మంది బలం, సామాజిక పెత్తందారీతనం సామాన్య ప్రజలపై కొనసాగింది. దానికి తోడు కొందరి అధికారుల అలసత్వం ప్రజలను పీడించింది. ఈ అవరోధాలను ప్రజా సంకల్ప పాదయాత్ర ద్వారా దగ్గర నుంచి చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి రాగానే పాలన మొత్తాన్ని ప్రజల వద్దకు తీసుకొస్తానని హామీ ఇచ్చారు. ప్రజల అపూర్వ మద్దతుతో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు సీఎం జగన్. సచివాలయం, వలంటీర్ వ్యవస్థలతో ప్రభుత్వం ప్రజలకు చేరువైంది. కపిలేశ్వరపురం మండలంలోని 19 గ్రామాల్లో 20 సచివాలయాలు, 15 రైతు భరోసా కేంద్రాలను నెలకొల్పి ప్రజల వద్దకు అధికారులను అందుబాటులోకి తీసుకొచ్చారు. మొక్కుబడి కార్యాచరణ కాకుండా ఒక్కో సచివాలయంలో 10 నుంచి 11 మంది ఉద్యోగులను నియమించారు. 17 మంది వ్యవసాయ అధికారులు, ఉద్యోగులను ప్రజల చెంతకే తీసుకొచ్చారు. ఎక్కడా లేని బలోపేతమైన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను దేశం మొత్తం ప్రశంసిస్తోంది. కేరళ వంటి ఇతర రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు ఈ వ్యవస్థలను పరిశీలించి అభినందించారు.

అన్నింటి సాధ్యం చేస్తున్న ఉద్యోగులు

గత ప్రభుత్వ హయాంలో విద్యార్థులు, రైతులు, సాధారణ ప్రజలు ధ్రువీకరణ పత్రాలను పొందేందుకు మండల కార్యాలయం చుట్టూ తిరిగేవారు. మీ సేవ కేంద్రాల సంఖ్య పరిమితంగా ఉండడంతో పాటు వాటిలో అందించే సేవలు తక్కువగా ఉండేవి. దీంతో ధ్రువీకరణ పత్రాలు, ప్రభుత్వ పథకంలో లబ్ధి పొందాలన్నా ప్రజలు అవస్థలు పడేవారు. సీఎం జగన్ ప్రభుత్వంలోని సచివాలయ వ్యవస్థ ప్రజా పాలనలో అద్భుతాలను సృష్టిస్తోంది. గత ప్రభుత్వంలో అసాధ్యం అనుకున్న పనులను సచివాలయ ఉద్యోగులు సుసాధ్యమని నిరూపిస్తున్నారు. వల్లూరు, టేకి తదితర అనేక గ్రామాల్లో అర గంటలో రేషన్ కార్డును మంజూరు చేసి చూపించారు.

తొలగిన వ్యయప్రయాసలు

గ్రామంలోనే రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేయడంతో రైతుల అవస్థలు తప్పాయి. గతంలో పాస్ బుక్ మంజూరు, విత్తనాలు, ఎరువులు కొనుగోలుకు కపిలేశ్వరపురం వ్యవసాయ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది. ప్రస్తుత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలతో గ్రామంలోనే దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందుతున్నారు. రైతు భరోసా, యంత్ర సేవా పథకాలలో లబ్ధి పొందేందుకు ఈ క్రాప్‌ను సైతం గ్రామంలోనే చేస్తున్నారు.


ఉద్యోగులు, వలంటీర్లకు ప్రోత్సాహం

సచివాలయ వ్యవస్థను తీసుకురావడంతోపాటు వ్యవస్థలోని ఉద్యోగుల బాగోగులను ప్రభుత్వం బాధ్యతాయుతంగా చూసుకుంటోంది. ఉద్యోగమిచ్చిన తర్వాత ప్రొబేషన్ పూర్తి చేసి పే స్కేలును అమలు చేసింది. వారికి బదిలీ సదుపాయాన్ని కల్పించింది. 2019 ఆగస్టులో విధుల్లో చేరినప్పటి నుంచి క్రమం తప్పకుండా వలంటీర్లను నగదు పురస్కారాలతో సత్కరిస్తోంది. ఈ ఏడాది కపిలేశ్వరపురం మండలంలో ఒకరిని సేవా వజ్ర పురస్కారంతోనూ ఐదుగురుని సేవా రత్నతోనూ, 286 మందిని సేవామిత్రతోనూ మొత్తం 292 మందిని నగదు పురస్కారాలతో సత్కరించింది. నేలటూరుకు చెందిన వాసంశెట్టి మంగాలక్ష్మి సేవా వజ్ర, అంగర వలంటీర్లు కాండ్రకోట సుధీర్, గుత్తుల భవానీ, నల్లూరుకు చెందిన అందే దుర్గ, నేలటూరుకు చెందిన కైలా శ్రీనివాస్, వాకతిప్పకు చెందిన గుత్తుల శ్రీనివాసరావు సేవారత్న పురస్కారాలను అందుకున్నారు.

కపిలేశ్వరపురం మండలంలో సచివాలయ వ్యవస్థ ఇలా

గ్రామ పంచాయతీలు	: 19
గ్రామ సచివాలయాలు	: 20
సచివాలయ ఉద్యోగులు	: 122 మంది
వలంటీర్లు	: 292 మంది
గత ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ సిబ్బంది	: 4
వైఎస్ జగన్ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ సిబ్బంది	: 17 మంది
గత ప్రభుత్వంలో పంచాయతీలో ఉద్యోగులు	: 4
వైఎస్ జగన్ ప్రభుత్వంలో సచివాలయంలో ఉద్యోగులు	: 11 మంది

ఊరులోనే విత్తనాలు



నేను ఎకరంలో భూమిలో సాగు చేస్తున్నాను. దానికి తోడు మరో నాలుగు ఎకరాలను కౌలుకు సాగు చేస్తున్నాను. గతంలో ఏ సమస్య వచ్చినా కపిలేశ్వరపురం వ్యవసాయ శాఖ కార్యాలయానికి వెళ్లి విత్తనాలు, ఎరువులు తీసుకునే వాడ్ని. ప్రస్తుత ప్రభుత్వం గ్రామంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రంలో విత్తనాలు, ఎరువులను తీసుకుంటున్నాను. రైతు భరోసా పథకంలో రూ.5,500 నా ఖాతాకు జమ అయ్యింది. ఈ క్రాప్‌ను ఆర్బీకేలోనే చేస్తున్నారు. పొలంబడి పాఠాలు అర్థవంతంగా ఉంటున్నాయి.

– దామిన బులిరాజు, రైతు, టేకి

సంతృప్తిగా ఉంది



వల్లూరు వలంటీర్‌గా పని చేస్తూ నెల నెలా పింఛను పంపిణీ చేస్తున్నాను. ఈ నెల నా పరిధిలోని కె.రామసూర్యనారాయణ పింఛను తీసుకోలేదు. ఏమిటని వాకబు చేశాను. ఆయన కాకినాడలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిసింది. నా బాధ్యతగా నేను కాకినాడ ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేశాను. ఇలాంటి సాయం చేసే వీలు వలంటీర్ కావడం వల్ల దక్కిందని ఎంతో సంతృప్తిగా ఉంది.

– గుత్తుల శివకృష్ణ, వలంటీర్, వల్లూరు

ప్రజాప్రతినిధులకు ఎంతో గర్వం



సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు వచ్చాకా పంచాయతీ పాలనలో నాణ్యత పెరిగింది. అన్ని శాఖల కార్యకలాపాలకు కేంద్రంగా సచివాలయం ఉంది. ఏ సమస్యను చెప్పినా దాదాపు అక్కడే పరిష్కారమవుతోంది. సమస్యలను పరిష్కరించేలా సచివాలయం ఉండడంతో నాతో సహా తోటి సర్పంచులు గర్వంగా భావిస్తున్నారు.

– వీధి వెంకటరెడ్డి, సర్పంచుల సమాఖ్య నియోజకవర్గ అధ్యక్షుడు, కేదారిలంక

గతంలో పింఛను ఇవ్వలేదు



నేను ఎముకల బలహీనతతో బాధపడుతున్నాను. 2019కు ముందు అనేక సార్లు పింఛను కోసం దరఖాస్తు చేసినా మంజూరు కాలేదు. తిరిగీ తిరిగి పింఛను ఇక రాదని ఊరుకున్నాను. సచివాలయ వ్యవస్థ వచ్చాక గ్రామ సచివాలయంలోనే పింఛను కోసం దరఖాస్తు చేశాను. సచివాలయంలోనే వివరాలను ఆన్‌లైన్ చేసి పింఛను మంజూరు చేశారు. చాలా సంతోషంగా ఉంది.

– పోసుపాటి సత్యనారాయణ, పీహెచ్ పింఛను లబ్ధిదారుడు, వల్లూరు

అన్ని సేవలు గ్రామాల్లోనే..



నేను సర్పంచ్‌గా చేసిన రోజుల్లో పంచాయతీలో కార్యదర్శితో పాటు మరో ముగ్గురు మాత్రమే ఉండేవారు. ప్రస్తుత సచివాలయంలో పాలనా కార్యకలాపాలతో పాటు రెవెన్యూ, సంక్షేమం, వ్యవసాయం, పాడి పరిశ్రమ, పోలీస్ శాఖల అధికారులంతా సచివాలయంలో అందుబాటులో ఉంటున్నారు. అన్ని సేవలు ఒకే చోట పొందే వీలు గ్రామస్తులకు దక్కుతోంది. మండల కార్యాలయాలు చుట్టూ తిరగాల్సిన అవస్థలు తప్పాయి.

– వంగా శ్రీనివాస్, మాజీ సర్పంచ్, పడమర ఖండ్రిక

తొలకరి సాగుకు రైతులు చొరవ చూపాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ చైర్మన్ గుత్తుల బుల్లిరాజు

కాజులూరు: తొలకరి సాగుకు రైతులు చొరవ చూపాలని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ గుత్తుల బుల్లిరాజు అన్నారు. శుక్రవారం కాజులూరులో వ్యవసాయాధికారి వి.అశోక్ ఆధ్వర్యంలో సలహామండలి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ గోదావరి తూర్పుడెల్టా కాలువకు ప్రభుత్వం ఈ నెల ఒకటో తేదిన సాగునీరు విడుదల చేయడంతో పాటు రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు ఆర్బీకేల్లో సిద్ధం చేసి ఉంచిందన్నారు. పంటకాలువల ద్వారా పొలాలకు సాగునీరు చేరుతుందని రైతులు పంట దమ్ములకు సిద్ధం కావాలన్నారు. జూన్ రెండో వారం నాటికి నారుమడులు చల్లుకుని జూలై మొదటివారం నాటికి నాట్లు పూర్తి చేసినట్లయితే అక్టోబరు నెలాఖరు నాటికి పంట ప్రకృతి వైపరీత్యాల బారిన పడకుండా చేతికొస్తుందన్నారు. మండల వ్యవసాయ సలహామండలి సభ్యులు రైతులను చైతన్యపరచి సాధ్యమైనంత త్వరగా తొలకరి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, సలహామండలి సభ్యులు మాత మురళి, దంగేటి అరుణ్‌కుమార్, మండల కౌలు రైతు సంఘం అధ్యక్షుడు అల్లాడి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



వరి కోత మెషీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: రైతు సంక్షేమమే తన ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అవసరమైన పనిముట్లను అందించడంలో తనదైన శైలిలో పని చేస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని వెల్ల గ్రామంలో వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా వేంకటేశ్వర క్లస్టర్ స్థాయి కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ హార్వెస్టర్ గ్రూపు సభ్యులకు శుక్రవారం కోత యంత్రాన్ని ప్రారంభించి అందజేశారు. మంత్రి వేణు మాట్లాడుతూ రైతాంగం ఎక్కడా ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా రైతులకు యంత్ర పరికరాలను అందిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా వెల్ల గ్రామానికి చెందిన సెంటర్ వారికి రూ.25 లక్షల విలువైన హార్వెస్టర్ని అందించినట్లు చెప్పారు. రూ.25 లక్షలను గ్రూపు సభ్యులు కేవల రూ.3 లక్షల 70 వేల రూపాయలు చెల్లించవలసి ఉంటుందన్నారు. ప్రభుత్వ రాయితీ రూ.8,80,000, డీసీసీ బ్యాంకు రూ.12 లక్షల 50 వేల రుణం కింద మంజూరు చేస్తుందని మంత్రి వివరించారు. కార్యక్రమంలో వెల్ల సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, వ్యవసాయాధికారి ఎస్.రంగారావు, గ్రూప్ సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మాతా, శిశు మరణాల నివారణకు కృషి చేయాలి

ఆలమూరు: మాతృత్వ, శిశు మరణాల నివారణకు, చిన్నారుల మెరుగైన ఆరోగ్య సంరక్షణను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ (పీఎంఎంఎస్ఏ) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చొప్పెల్ల, పెదపళ్ల, ఆలమూరు వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలానాయుడు అన్నారు. పీఎంఎంఎస్ఏ పథకంలో భాగంగా శుక్రవారం సుమారు 118 మంది బాలింతలు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. సమావేశంలో బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న సేవలను, తీసుకోవలసిన జాగ్రత్తలను ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది వివరించారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా తొమ్మిదిన బాలింతలు, గర్భిణులకు నిర్వహిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు కోరారు.

వ్యక్తిపై కేసు

అంబాజీపేట: పాత గొడవల నేపథ్యంలో భార్యాభర్తలను నానా దుర్భాషలాడి, మానసికంగా వేధిస్తున్నాడని ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వై.సూర్యనారాయణ తెలిపారు. దీనికి సంబంధించి స్థానిక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాచవరం శివారు పండువారిపేటకు చెందిన చిత్రపు దుర్గాదేవి తన ఇంటి నిర్మాణం కోసం వస్తువులు కొనుగోలు చేసుకుని లారీపై తీసుకువస్తుండగా పేటలోకి రానివ్వకుండా నాగవరపు అన్నవరం అడ్డుకుంటున్నాడన్నారు. లారీని లోపలకు రాకుండా ఎందుకు అడ్డుకున్నావని అన్నవరంను ప్రశ్నిస్తే దుర్గాదేవిని, ఆమె భర్తను నానా దుర్భాషలాడి అవమాన పరిచాడన్నారు. దుర్గాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

త్వరితగతిన భక్తులకు స్వచ్ఛమైన సప్తగోదావరి



ద్రాక్షారామ భీమేశ్వరాలయ సప్తగోదావరి పనుల్లో పాల్గొన్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి భక్తులకు స్వచ్ఛమైన సప్తగోదావరి కోనేరును త్వరితగతిన అందజేయడానికి పనులను దాతలు, ప్రభుత్వ సహకారంతో వేగవంతం చేసినట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. ఆలయంలో జరుగుతున్న సప్తగోదావరి ప్రక్షాళన పనులను మంత్రి శుక్రవారం పరిశీలించి పనుల్లో స్వయంగా పాల్గొన్నారు. వివిధ కారణాలతో కాలుష్యంగా మారిన సప్తగోదావరితో భక్తుల మనోభావాలకు ఇబ్బంది కలుగుతుందని గుర్తించి ఒక సేవకుడిగా స్వామి కోనేరుకు అపూర్వ వైభవం తెచ్చేందుకు నడుం బిగించినట్లు తెలిపారు. దీనికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, దాతల సహకారంతో ఎల్లప్పుడూ స్వచ్ఛమైన నీరు ఉండేలా ప్రణాళిక సిద్ధం చేసి పనులను వేగవంతం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు, శ్రీ రాజరాజేశ్వరి పీఠాధిపతి, మాసశివరాత్రి కమిటీ వ్యవస్థాకులు తాళ్ల సాంబశివరావు గురూజీ, నాయకులు అనిశెట్టి రామకృష్ణ, బత్తుల అప్పారావు, కూరాడ రమణ, ఎంపీటీసీ రెడ్నం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా సాగు సాయం



నల్లూరులో సాగు ప్రణాళికపై మాట్లాడుతున్న పుట్టా కృష్ణమూర్తి

కపిలేశ్వరపురం: ఖరీఫ్ సాగుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా సాయమందిస్తుందని మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి అన్నారు. ఆయన అధ్యక్షతన నల్లూరు పీఏసీఎస్‌లో శుక్రవారం మండలి సమావేశం నిర్వహించారు. వ్యవసాయ అనుబంధ అధికారులు సమక్షంలో సాగు పద్ధతులు, అవసరాలపై చర్చించారు. ఖరీఫ్ ప్రణాళికను ఏఓ కేవీఎస్ రమేష్‌కుమార్ వివరించారు. పీఎం కిసాన్ సమాన్ నిధి 14 విడత సాయం రూ.2వేలు పొందేందుకు లబ్ధిదారులు విధిగా బయోమెట్రిక్ వేయాలన్నారు. మండలంలోని 15 ఆర్బీకేల్లో రాయితీపై వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. తహసీల్దార్ కొమరం సూర్యారావు మాట్లాడుతూ పంట సాగు యాజమాన్య హక్కు పత్రాలు మంజూరు నియమాలను వివరించారు. అర్హత ఉన్న రైతులు వీఆర్వోను సంప్రదించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, మండలి సభ్యులు కుడిపూడి రాంబాబు, మేడిశెట్టి దుర్గారావు, నక్కా సింహాచలం, వింటి దుర్గారావు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రాధాన్యం ఇవ్వాలి



పెదపళ్లలో నిల్వ నీటితో కలిగే అనర్థాలను వివరిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందుకు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రైడే)గా పాటించాలని కొత్తపేట డివిజన్ అదనపు జిల్లా వైద్యాధికారి ఎం.సుమలత అన్నారు. పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలానాయుడు ఆధ్వర్యంలో వైద్యారోగ్య, ఆశ సిబ్బంది ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని వారంతా ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. ఈసందర్భంగా వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రై డేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తపేట: మామిడిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తూ జారిపడి వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు స్థానిక ఏఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని ఖండ్రిగ పంచాయతీ పులుసుగంటివారిపేటకి చెందిన పి.సత్యనారాయణ (50) గత నెల 20న తన ఇంటి సమీపాన ఉన్న మామిడిచెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తూ జారిపడి గాయపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు, అతడిని రాజమహేంద్రవరం ఆపై కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై తెలిపారు.

వాహనదారులు త్రైమాసికం పన్నులు చెల్లించాలి



రావులపాలెం హైవేపై వాహనాలను తనిఖీ చేస్తున్న ఎంవీఐ శ్రీనివాస్

రావులపాలెం: లారీ, ట్రాక్టర్, గూడ్స్ వాహనాల యజమానులు త్రైమాసికం పన్నులు సకాలంలో చెల్లించాలని రావులపాలెం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) వి.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం స్థానిక నేషనల్ హైవేపై ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు రోడ్ పన్నులు సక్రమంగా చెల్లించకపోవడంతో తనిఖీల్లో పట్టుబడితే భారీ పెనాల్టీలు కట్టాల్సి వస్తుందన్నారు. వాహనదారులపై పడే ఈ అదనపు భారాన్ని నివారించుకోవడానికి త్రైమాసిక పన్నులు సమయానికి చెల్లించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రావులపాలెం యూనిట్ కార్యాలయం పరిధిలో పనులు చెల్లించకుండా ఉన్న వాహనాలు ట్రైలర్లు 384, గూడ్స్, ఇతర వాహనాలు 253 ఉన్నాయన్నారు. అలాగే 1988 మోటార్ వాహనాల చట్టం లోని రోడ్డు భద్రతకు సంబంధించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఈ ఆర్థిక సంవత్సరంలో 760 కేసులు నమోదు చేశామన్నారు. ఈ కేసుల్లో సుమారు రూ.25 లక్షల అపరాధ రుసుము వసూలు చేశామన్నారు. లైసెన్సులు లేకుండా, ఓవర్ లోడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, టార్పాలిన్ కప్పకుండా తిరుగుతూ ఈ విధంగా నిబంధనలు పాటించని వారు ఈ కేసుల్లో ఉన్నారని ఆయన తెలిపారు. వాహన యజమానులు, డ్రైవర్లు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని వాహన చట్టాలను పాటిస్తూ రవాణా అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.